

కాగ్నా నది



కమ్యూనిటీహాల్‌లో కొనసాగుతున్న బషీరాబాద్ మండలం కుప్పంకోట్ పంచాయతీ

ప్రభుత్వం అట్టహాసంగా చిన్న చిన్న పల్లెలను పంచాయతీలుగా ప్రకటించింది. కానీ మౌలిక సదుపాయాల కల్పనలో మాత్రం విఫలమైంది. పల్లె పాలనా వ్యవస్థను బలోపేతం చేసేందుకు గాను గూడేలు, తండాలను పంచాయతీలుగా మార్చింది. వాటికి పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లోనే పాలనా వ్యవహారాలు కొనసాగిస్తున్నారు. పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూల్ గదులు, కమ్యూనిటీ హాళ్లలో పాలన సాగిస్తున్నారు. జిల్లాలో మొత్తం 566 పంచాయతీలుండగా 224 జీపీలకు పక్కా భవనాలు లేవు. ఇక భవనాలు ఉన్న చోట మరమ్మతులకు నోచుకోక అందులోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీంతో కనీస వసతులు కరువై పాలనా సిబ్బంది, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

నిధుల మంజూరులో జాప్యం

పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించాలనేది ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. కార్యాలయాలు లేని పంచాయతీలకు మూడు విడుతల్లో భవనాలు నిర్మించాలని గత ప్రభుత్వం ప్రతిపాదించింది. వెయ్యి లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.10లక్షలు, రెండు వేల లోపు జనాభా కలిగిన పంచాయతీలకు రూ.15 లక్షలు, ఆపై జనాభా ఉన్న పంచాయతీలకు రూ.20 లక్షలు భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని నిర్ణయించింది. అయితే నిధుల మంజూరులో జాప్యం చోటు చేసుకోవడం వల్ల జీపీలు సొంత భవనాలకు నోచుకోకుండా పోయాయి. దీంతో భవనాలుండి శిథిలావస్థకు చేరిన చోట మరమ్మతులు చేపట్టాలని, తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్న చోట పక్కా భవనాలు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది. త్వరలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు కొనసాగుతున్న నేపథ్యంలో కొత్త పాలక వర్గాలు కొలువుదీరే నాటికి పెండింగ్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంచాయతీలకు పక్కా భవనాలేవి?

అంగన్‌వాడీ కేంద్రాలు, అద్దె భవనాల్లో పల్లె పాలన

- కనీస వసతులు లేక అస్తవ్యస్తంగా పల్లె పాలన
- 224 జీపీలకు కార్యాలయాలు కరువు
- సొంత భవనాలున్న చోట మరమ్మతులు అవసరం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పాలనా సిబ్బంది
- జిల్లాలో మొత్తం పంచాయతీలు 566

వికారాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేసేందుకు కొత్తగా ఏర్పాటు చేసిన పంచాయతీలు సొంత భవనాలకు నోచుకోక పల్లె పాలన అస్తవ్యస్తంగా మారింది. గ్రామ పాలనకు కేంద్రమైన పంచాయతీలకు సొంత భవనాలు లేక సిబ్బంది నానా అవస్థలు పడుతన్నారు. అంగన్‌వాడీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, పాఠశాలల అదనపు గదులు, ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయి. జిల్లాలో సగానికిపైగా పంచాయతీలకు పక్కా భవనాలు లేవంటే అతిశయోక్తి కాదు. సొంత భవనాలున్న చోట మరమ్మతులకు నోచుకోని దుస్థితి. ఐదున్నరేళ్ల కిందట కొత్తగా ఏర్పాటైన పంచాయతీలు అప్పటి నుంచి ప్రైవేట్ భవనాల్లోనే పాలన కొనసాగిస్తున్నాయి. పక్కా భవనాలు లేని చోట సరైన వసతులు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

60 శాతం గ్రామాలకే..

జిల్లాలో మొత్తం 566 పంచాయతీలు ఉండగా, వాటిలో 342 పంచాయతీలకే సొంత భవనాలు ఉనాయి. పక్కా భవనాలు కలిగిన పంచాయతీల్లో 253 భవనాలు మాత్రమే మంచి స్థితిలో ఉన్నాయి. 89 పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరాయి. అయిదున్నరేళ్ల కిందట కొత్తగా ఏర్పాటైన 198 పంచాయతీలు చాలా వరకు తాత్కాలిక భవనాల్లోనే కొనసాగుతున్నాయి. సొంత భవనాలు లేని 33 గ్రామాల్లో పంచాయతీ భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతించినా, వాటిలో ఇంకా కొన్నింటి నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం గమనార్హం.



అసంపూర్తి నిర్మాణంలో పర్వత్‌పల్లి పంచాయతీ భవనం

కొత్తగా 19 పంచాయతీలు

జిల్లాలో కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. 19 కొత్త జీపీలను ఏర్పాటు చేస్తూ గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనకు కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపిన విషయం విదితమే. ధారూరు మండలంలో లక్ష్మీనగర్ తండా, కొండాపూర్ కుర్దు, మోమిన్‌పేట మండలంలో రావులపల్లి, మర్పల్లి మండలంలో రాంపూర్, కుడుగుంట, బంట్వారం మండలంలో మంగ్రాస్‌పల్లి, పూడూరు మండలంలో రాకంచర్ల, కులకచర్ల మండలంలో దీప్లానాయక్ తండా, పెద్దేముల్ మండలంలో తింసాన్‌పల్లి, బొంరాస్‌పేట్ మండలంలో సోమ్లానాయక్ తండా, కట్టుకాల్వ తండా, సీత్యానాయక్ తండా, దౌల్తాబాద్ మండలంలో తిమ్మాయిపల్లి, తిర్మలాపూర్, యాలాల్ మండలలో దేవులా తండా, పేర్కంపల్లి తండా, బషీరాబాద్ మండలంలో మల్కాన్‌గిరి, పేర్యా నాయక్ తండా, గంగ్వార్ గ్రామాలు పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. వీటితో కలిపి జిల్లాలో పంచాయతీల సంఖ్య 585 కు పెరిగింది. వికారాబాద్ జిల్లా ఏర్పాటైన సమయంలో జిల్లాలో పంచాయతీల సంఖ్య 367 ఉండగా, 2018లో అప్పటి ప్రభుత్వం జిల్లాలో కొత్తగా 198 పంచాయతీలు ఏర్పాటు చేసింది. గ్రామ పంచాయతీల పాలక వర్గాల పదవీ కాలం ముగియడంతో ఫిబ్రవరి రెండో తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే.

'కాగ్నా' కలుషితంపై నోటీసులు

తాండూరు, ఆగస్టు 23: కాగ్నా నది జలాలు కలుషితం అవుతుండటంతో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి తాండూరు మున్సిపాలిటీ, ఇరిగేషన్ శాఖ, కోకట్ గ్రామ పంచాయతీలకు నోటీసులు జారీ చేసింది. నీటి వనరులు సురక్షితంగా ఉండాలని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోక పోవడంతో తాండూరు సామాజికవేత్త రాజ్‌గోపాల్ సార్డా జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. తాండూరు పట్టణంలోని కొన్ని ప్రాంతాలకు చెందిన మురుగు నీరు చిలుక వాగు ద్వారా అలాగే కోకట్ గ్రామ మురుగు కాగ్నా నదిలో కలుస్తున్నాయి. సాగుకు తాగు నీటికి జీవనాధారమైన ఈ నది కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఇరిగేషన్ అధికారులకు నోటీసులు జారీ చేసింది.

తాండూరు సబ్ కలెక్టర్‌గా ఉమాశంకర్



తాండూరు, ఆగస్టు 23: తాండూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి ప్రత్యేక హోదాను కల్పించిన నెలన్నరకు ఐఏఎస్ అధికారిని నియమించారు. సబ్ కలెకర్‌గా ట్రైనీ ఐఏఎస్ ఉమా శంకర్ ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులను జారీ చేసింది. ఆయన తాండూరు సబ్ డివిజన్‌కు రెండో సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. గతంలో ఐఏఎస్ సందీప్ కుమార్ సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఉమాశర్ ప్రసాద్ 26వ తేదీ తర్వాత విధుల్లో చేరే అవశం ఉన్నట్లు సమాచారం. పరిపాలన సౌలభ్యం, వేగంగా అభివృద్ధి పనులు చేపట్టడం, స్థానికంగా భూ సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా 15 రెవెన్యూ సబ్ డివిజన్లకు సబ్ కలెక్టర్ హోదా కల్పించగా ఉమ్మడి జిల్లాలో తాండూరు ఆర్డీఓ కార్యాలాయన్ని సబ్ కలెక్టరేట్‌గా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆర్డీఓగా శ్రీనివాస్‌రావు కొనసాగుతున్నారు.



అలుగుపోస్తున్న పెద్ద చెరువు

మత్తడి దుంకుతున్న పెద్దచెరువు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 23: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మేడ్చల్ పెద్ద చెరువు నిండుకుండలా మారి అలుగు పారుతోంది. రెండు రోజుల క్రితం వరద నీరు మత్తడి వరకు చేరుకుంది. దుండిగల్, గాగిల్లాపూర్ చెరువులు నిండి అక్కడ అలుగులు పారడంతో అక్కడి నుంచి పెద్ద మొత్తంలో వరద మేడ్చల్ పెద్ద చెరువుకు చేరుకుంది. దీంతో చెరువులో నీటిమట్టం పెరిగి మత్తడి దుంకుతోంది. రానున్న రెండు మూడు రోజుల్లో చెరువులో నీటి మట్టం మరింత పెరిగి అలుగు మరింత ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

అభివృద్ధి ఫలాలు ప్రతీ ఇంటికి చేరాలి

- ఐదేళ్లలో 'వికారాబాద్' అన్ని రంగాల్లో అభివృద్ధి
- పర్యాటక కేంద్రంగా అనంతగిరి
- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



సమావేశంలో జిల్లా అధికారులు

వికారాబాద్, ఆగస్టు 23 : సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అర్హులైన ప్రతీ ఇంటికి చేర్చే బాధ్యత అధికారులపై ఉందని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తెలంగాణ హక్కుల రికార్డు ముసాయిదా బిల్లు-2024, ఎల్ఆర్ఎస్, అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు. స్పీకర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు స్నేహపూర్వకంగా, సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. రానున్న ఐదు సంవత్సరాలలో జిల్లా ఎంతగానో అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. జిల్లాలో పరిశ్రమలు, విద్యారంగ అభివృద్ధితో పాటు రూ.400 కోట్ల నిధులతో అనంతగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యవసాయం, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రతి నెల ముఖ్యమైన శాఖలపై సమీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భూముల సమస్యలను సత్వర పరిష్కారానికి భూమాత చట్టాన్ని తీసుకు వస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిస్కార నిమిత్తం కోర్టుల చుట్టూ తిరుగకుండా కింది స్థాయిలోనే సమస్యలను పరిష్కారమయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

మౌలిక వసతులు కల్పించాలి

2014 కంటే ముందు ఉన్న సాదా బైనమా సమస్యలను పరిష్కరించే అవకాశం ఉందని తెలిపారు. పశు సంపదను సంరక్షించుకునే బాధ్యతలో భాగంగా పశువులకు వాక్సినేషన్‌కు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. గురుకుల పాఠశాలలలు, అమ్మ ఆదర్శ పాఠశాలలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కాగ్నా నది ద్వారా మంచి నీరును అందించే దిశగా మిషన్ భగీరథ, జిల్లా పంచాయతీ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమీక్షలో ఎంపీ విశ్వేశ్వరరెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాంమోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, కాలే యాదయ్య, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, మున్సిపల్ చైర్ పర్సన్లు మంజుల రమేశ్, స్వప్న పరిమల్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరలు పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమార్చన



శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని వికారాబాద్ పట్టణంలోని శివరాంనగర్ కాలనీ సంతోషిమాత ఆలయంలో కుంకుమార్చన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో పట్టణ ప్రముఖులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వికారాబాద్, ఆగస్టు 23

60 కిలోల గంజాయి పట్టివేత

యాచారం, ఆగస్టు23: ఏపీనుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను గురువారం సాయంత్రం యాచారం పోలీసులు, మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. యాచారం మండలం మాల్ చెక్ పోస్టు వద్ద 60కిలోల 420 గ్రాముల గంజాయితో పాటు (ఏపీ 39హెచ్‌డబ్ల్యూ 0623) కారు, రెండు సెల్ ఫోన్లతో పాటు ఇరువురిని అదుపులోకి తీసుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. అలంపట్టు గ్రామం హుకుంపేట మండలం అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కొర్రబాబురావు, బొడ్డిగూడగ్రామం. దుమురిగూడమండలానికి చెందిన బురడికామేశ్వర్‌రావులు, వృత్తిరీత్యా వ్యవసాయం చేస్తారు. విశాఖపట్నంజిల్లా గోపాలపురానికి చెందిన షేక్ మస్తాన్‌అలీ, వెంకోజుపాలానికి చెందిన దుడ్డు మహేశ్వర్‌రావు, వేములపుడి గ్రామం నర్సీపట్నం మండలానికి చెందిన శ్రీనివాస్‌నాయుడు, గిరీష్ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. గోప్యంగా గంజాయి వ్యాపారం కొనసాగిస్తున్నారు. కొర్రబాబురావు, బురడికామేశ్వర్‌రావులు పది క్వింటాళ్ల గంజాయి రవాణాకు ఒప్పందం చేసుకున్నారు. ఈ నెల 20న వారు ఏపీలో గంజాయిని ప్యాక్ చేసి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్నారు. మిగిలిన వారు నగరంలో గంజాయిని విక్రయించేందుకు బల్దేరారు. కాగా యాచారం మండలంలోని మాల్‌లో మహేశ్వరం ఎస్ఓవో పోలీసులు, యాచారం పోలీసులు కారును తనిఖీ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. షేక్‌మస్తాన్‌అలీ, దుడ్డు మహేశ్వర్‌రావు, శ్రీనివాస్ నాయుడు గిరీష్ కోసం గాలిస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ వెల్లడించారు.



పోలీసులు పట్టుకున్న గంజాయి

కల్తీకల్లుగా నిర్ధారణ కాలేదు

- రిపోర్టు వచ్చాక స్పష్టత వస్తుంది
- పీరంపల్లి ఘటనపై డీపీఈవో విజయభాస్కర్
- అధికారుల తీరుపై స్థానికుల నిట్టూర్పు

వికారాబాద్, ఆగస్టు 23: పీరంపల్లి ఘటన కారణమైన కల్లు.. కల్తీనా కాదా అనేది ఇంకా నిర్ధారణ కాలేదని రిపోర్ట్ వచ్చిన తర్వాతనే తేలుతుందని డీపీఈవో విజయభాస్కర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీపీఈవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా ఇంకా ప్రజలు ఆసుపత్రికి వస్తుంటే సీజనల్ వ్యాధుల ప్రభావం కావచ్చని అనుమానంతో పాటు వేరే ఏదైనా కారణమై ఉందాని విచారిస్తున్నట్లు తెలిపారు. కల్లు తాగిన వారి అందరికీ సమస్య కాలేదని కొందరికే ఇబ్బంది కావడంతో కల్తీకల్లు అనడానికి నమ్మశక్యంగా లేదన్నారు. కల్లులో సీహెచ్(క్లోరల్ హైడ్రేట్) కలిసి ఉండోచ్చా అని రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు అధికారి సమాధానం ఇస్తూ జిల్లాలో ఎక్కడ క్లోరల్ హైడ్రేట్ లేదని స్పష్టం చేశారు. జిల్లాలో 341 టీఎఫ్‌సీలు, 57 టీసీఎస్‌లు ఉన్నాయని ఈ ఏడాది 124 దుకాణాల్లో తనిఖీలు చేయగా నాలుగు దుకాణాల్లో కల్తీకల్లు తయారీకి అవసరమైన కెమికల్ ఉండడాన్ని గుర్తించి లైసెన్సులు రద్దు చేసి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

ఎన్నో అనుమానాలు?

ఇదిలా ఉంటే నిర్ధారణ కాకుండానే అధికారులు విలేకరుల సమావేశం పెట్టడం ప్రశ్నార్థకంగా మారింది. కల్తీ కల్లు వల్లే ఈ సంఘటన జరిగిందని ఒక వైపు గ్రామస్తులు, మరో వైపు వైద్యులు సైతం తేల్చి చెబుతున్నా అధికారులు ఇంకా ఎటూ తేల్చకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే ఒకరూ చనిపోగా ఇద్దరు చావు బతుకులతో కొట్లాడుతున్న సమయంలో పూర్తి స్థాయి విచారణ చేసి వైద్యులు, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా ఒక నిర్ధారణకు వచ్చిన తరువాత జరిగిన సంఘటనపై ఒక రిపోర్ట్ ఇస్తే బాగుండేది. కానీ అక్కడ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతూ డబ్బులు కట్టలేని పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో అది కల్తీకల్లు కాదు సీజనల్ వ్యాధులు అయి ఉంటాయని చెప్పడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్తీ కల్లు వ్యాపారులను రక్షించే క్రమంలో కింది స్థాయి అధికారులు ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా గురువారం జిల్లా వైద్యాధికారి పల్వన్ కుమార్ కల్తీకల్లు బాధితులు కోలుకుంటున్నారని ప్రెస్‌నోట్ విడుదల చేసిన రెండు గంటల తరువాత అక్కడ సీజనల్ వ్యాధుల వల్లే ఈ విధంగా జరిగిందని మరో ప్రెస్‌నోట్ రిలీజ్ చేయడం, ఎక్సైజ్ శాఖలోని ఓ అధికారి, ఓ డాక్టర్ ద్వారా మరో డాక్టర్‌కు ఫోన్ చేయించి కల్తీకల్లు అని మీడియాకు చెప్పొద్దని సూచించడం అనుమానాలకు తావిస్తోంది. పీరంపల్లి గ్రామంలో కల్లు అమ్మేందుకు అనుమతులు కూడా లేక పోవడం ఆ కల్లు ఇతర ప్రాంతాల నుంచి రావడం గమనార్హం.



మాట్లాడుతున్న డీపీఈవో విజయభాస్కర్

అనుమతి లేని కల్లు దుకాణాలను తొలగించాలి

- కల్తీకల్లు బాధితులను పరామర్శించిన ఎంపీ కొండా



చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

వికారాబాద్: కల్తీ కల్లుకు కారకులైన వారు ఎవరైన సరే కఠినంగా శిక్షించాలని చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఆ కల్లు శాంపిల్స్ తనకు కూడా పంపాలని, వాటిని ల్యాబ్‌లో పరిశీలిస్తే నిజాలు బయటకు వస్తాయన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని మిషన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పీరంపల్లి కల్తీకల్లు బాధితులను ఆయన పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అది ఈత తాటి కల్లు కాదని కేవలం డైజోఫామ్‌తో తయారు చేసిన కృతిమ కల్లు అని అన్నారు. కల్తీకల్లును పూర్తిగా నిషేధించాలని తెలిపారు. అనుమతులు లేకుండా కొనసాగుతున్న కల్లు దుకాణాలను వెంటనే తొలగించాలన్నారు. చాలా మంది కల్తీ కల్లు బారిన పడ్డారని, ఇప్పటికే ఒకరూ మృతి చెందగా మరో ఒకరు ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు, కల్తీ కల్లు అమ్మకాలు జరుగుతున్నాయని అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టులు మృతి చెందిన దుర్గయ్య గుండెపోటుతో మృతి చెందారని అధికారులు తెలుపుతున్నారని ప్రశ్నించగా పోస్టుమార్టం రిపోర్ట్ కల్లు శాంపిల్స్ పరిశీలించిన తర్వాత నిజాలు తెలుస్తాయన్నారు. ఆయన వెంట నాయకులు నంద, శ్రీధర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, బస్వలింగం, తదితరులు ఉన్నారు.

ఆస్పత్రిలో చేరిన మరో ముగ్గురు

కల్తీకల్లు బాధితుల సంఖ్య సుమారుగా 45కు చేరింది. ఇప్పటికే పట్టణంలోని మిషన్ ఆస్పత్రి, ఈశ, మెడిక్యూర్, మా శారద ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా నేడు మిషన్ ఆసుపత్రికి మరో ముగ్గురు చికిత్స కోసం వచ్చారు. అయితే అందులో ఎల్లయ్య అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండగా, హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రశాంత్ పరిస్థితి కూడా విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట, ఆగస్టు 23: జడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. అలియాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని రుచిగా వండిపెట్టాలన్నారు. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్‌ఎం, ఉపాధ్యాయులను, వంట మనుషులను హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం రోజూ ఎలా పెడుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పాఠశాల తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల రికార్డులను, మధ్యాహ్న భోజన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. మీ భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలను శ్రద్ధగా, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ యాదగిరిరెడ్డి ఉన్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ విజేయేందర్‌రెడ్డి



బోనాల ఉత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్

మైసమ్మ, ఎల్లమ్మకు బోనాలు

తరలివచ్చిన భక్తులు

కొత్తూర్, ఆగస్టు 23: కొత్తూర్ మున్సిపాలిటీలో శుక్రవారం రాత్రి మైసమ్మ, ఎల్లమ్మ బోనాల మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని సత్యసాయికాలనీలోని పోచమ్మ దేవాలయం నుంచి, మైసమ్మ కాలనీలోని మైసమ్మ దేవాలయంతో పాటు ఎల్లమ్మ దేవాలయం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల నడుమ పోతురాజుల నృత్యాలు, శివసత్తుల పూనకాలు నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. విశ్వశాంతి యూత్ ఆధ్వర్యంలో ఫలహార బండిని ఊరేగింపు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ బోనాల ఉత్సవానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జె. వేణుగోపాల్‌గౌడ్, కడెంపల్లి సదానంద్‌గౌడ్, బాతుక లక్ష్మయ్యయాదవ్, జె. సుదర్శన్‌గౌడ్, మాదారం నర్సింహ్మగౌడ్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, జె. శ్రీను, బ్యాగరి యాదయ్య, జంగగళ్ల కృష్ణయ్య, మాసుల అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రవినాయక్, బండికృష్ణ, పేపర్ యాదయ్య, జహంగీర్‌జీ, గణేష్‌గౌడ్, రాఘవేందర్‌యాదవ్, విశ్వశాంతి యూత్ అధ్యక్షుడు నాగరాజు శర్మ, మేకల రవీందర్‌యాదవ్, రాజుయాదవ్, వేణుగోపాల్‌చారి, కుమార్‌యాదవ్, బండి శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న వేణుగోపాల్ గౌడ్ కుటుంబసభ్యులు

ప్రతీ విద్యార్థి లక్ష్యం దిశగా ముందుకెళ్లాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బుచ్చిబాబు

పెద్దేముల్, ఆగస్టు 23: ప్రతీ విద్యార్థి తాను నిర్దేశించుకున్న లక్ష్యందిగా ముందుకెళ్లాలని జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ బుచ్చిబాబు, మానసిక వైద్య నిపుణులు మనోజ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మెంటల్ అండ్ హెల్త్‌స్ట్రెస్ మేనేజ్మెంట్ ప్రోగ్రాంపై వారు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుపైనే దృష్టిపెట్టి లక్ష్యాలు సాధించాలని తెలిపారు. మానసికంగా కుంగుబాటుకు గురికావద్దన్నారు. లక్ష్యం సాధించేందుకు ఎన్ని అడ్డంకులు వచ్చినా వాటిని తేలికగా తీసుకోవాలని చెప్పారు. ఒత్తిడికి గురైతే లక్ష్యాలు దూరమవుతాయని సూచించారు. ఒత్తిడి దరిచేరనీయకుండా ఉండేందుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మనస్తత్వవేత్త ప్రయా, కృష్ణకాంత్, ఏఎన్ఎం వెంకటమ్మ పాల్గొన్నారు.

హెల్ప్ లెస్ డెస్క్



ఖాళీగా కనిపిస్తున్న తాండూరు ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్

తాండూరు, ఆగస్టు 23: ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సందేహాలు ఉన్న చాలా మంది సందేహాలను అడిగి తెలుసుకుందామనుకున్న వారికి నిరాశతో వెను తిరిగి వెళ్తున్నారు. తాండూరు మున్సిపాలిటీలో గురువారం ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ శుక్రవారం 24 గంటల్లోనే మూతపడినట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీ ఆవరణలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో టౌన్‌ప్లానింగ్ విభాగం చెందిన అధికారులు కూర్చోవాల్సి ఉంటుంది. అయితే ఖాళీ కుర్చీలు దర్శనమివ్వడంతో ప్రజలు తమ సందేహాలను ఎవరిని అడగాలని ప్రశ్నిస్తున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా వేంకటేశ్వర ఆలయం

మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు



ఈశాన్య ద్వారాన్ని ప్రారంభిస్తున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్‌అర్బన్, ఆగస్టు 23: వెంకటేశ్వరస్వామి దేవాలయానికి దాతల సహకారంతోనే పూర్వవైభవం తీసుకువచ్చి, ఆధ్యాత్మిక కేంద్రంగా ముందుకు నడిపిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అభిప్రాయపడ్డారు. ఈశాన్య ద్వారాన్ని శుక్రవారం బక్కని నర్సింహులు ప్రారంభించారు. అలాగే ఉత్తర ద్వారంపై ప్రతిష్ఠించిన శ్రీ అనంత పద్మనాభస్వామి విగ్రహాలకు ప్రముఖ న్యాయవాది కంచి రాజ్‌గోపాల్ పూజచేసి, ఆవిష్కరించారు. ఆలయ భూమి పరిరక్షణ కోసం ప్రహరీ గేట్లను దండు శరత్‌చంద్రబాబు, ఎల్. మోహన్ రెడ్డి, ఖాజాపాషలు ప్రారంభించారు. దాతలు ముందుకు రావడంతోనే ఆలయం అభివృద్ధి చెందుతూ భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కానుగు అంతయ్య, టి. ప్రతాప్‌రెడ్డి, ఈగ వెంకట్‌రాంరెడ్డి, పాతూరి వెంకట్‌రావు, బి. జగన్‌మోహన్‌రెడ్డి, పరిగి వెంకట సాయిశ్వర్‌రెడ్డి, యాదవచారి, ఒగ్గు కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు ఎల్ఆర్ఎస్ స్పెషల్ డ్రైవ్

శామీర్‌పేట, ఆగస్టు 23: తూంకుంట మున్సిపల్ పరిధిలోని అంతాయిపల్లిలో గల ఎస్ఎస్ఆర్ లేఅవుట్ వెంచర్‌లో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో టీపీవో మణిహారిక ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రెగ్యులరైజేషన్‌కు శుక్రవారం రెండో రోజు స్పెషల్ డ్రైవ్ క్యాంప్‌ను కొనసాగించారు. ఈ సందర్భంగా 2020వ సంవత్సరం వరకు హెచ్ఎండీఏ అనుమతులు లేకుండా కొనుగోలు చేసిన ప్లాట్లను రెగ్యులరైజ్ చేయడానికి పరిశీలిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, టీపీవో మణిహారిక తెలిపారు. ఈ క్యాంప్‌లో దాదాపు 50ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను, ప్లాట్ల డాక్యుమెంట్లను టీపీవో, అధికారుల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ప్లాట్ల యజమానులతో డాక్యుమెంట్ల పూర్వపరాలపై టీపీవో విచారణ జరిపారు. డాక్యుమెంట్లు ప్రభుత్వ నిబంధనల మేరకు సరిగ్గా ఉంటే రెగ్యులరైజ్ చేసేందుకు మూడు దశల్లో దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు టీపీవో తెలిపారు.

కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో కర్ణాటక మాజీ మంత్రి పూజలు



సర్టిఫికెట్ అందజేస్తున్న కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి అరవిందలింబావళి

తాండూరు రూరల్, ఆగస్టు 23: తెలంగాణ-కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని తాండూరు మండలం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మను కర్ణాటక రాష్ట్ర విద్యాశాఖ మాజీ మంత్రి అరవింద లింబావళి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణమాసం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో తైక్వాండో సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

వాసవీ మాతకు మల్లెపూలతో అభిషేకం

- సామూహిక కుంకుమార్చన
- ఆలయాల్లో మహిళల సందడి



వాసవి మాతకు మల్లెపూలతో అలంకరణ

తాండూరు, ఆగస్టు 23: తాండూరు పట్టణ నగరేశ్వర ఆలయంలో కొలువైన ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవీ మాత వేడుకలు వైభవంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళలు తరలిరావడంతో నగరేశ్వర ఆలయం, వాసవీ మాత అమ్మవారి ఆలయం మహిళలతో సందడిగా కనిపించింది. మహిళలు అమ్మవారికి మల్లెపూలతో ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహిళలకు పోటీలు నిర్వహించి మహిళా సంఘం ఆధ్వర్యంలో బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి, వాసవీ మహిళా సంఘం అధ్యక్షురాలు కోట్రిక నాగలక్ష్మి, వాసవీ మహిళా సంఘం సభ్యులు సంధ్య, సరిత, గుబ్బ, ప్రగతి, శోభ, దీపా, శశిరేఖ, కల్వ అర్చన పాల్గొన్నారు. శ్రావణ మహలక్ష్మి బహుమతులు జి.సునిత, సంగీ తలను వరించగా పెద్ద ముత్తైదువు విభాగంలో మొదటి బహుమతి శంకరమ్మలకు దక్కింది.

స్నేహ మహిళా సొసైటీ అధ్యక్షురాలుగా కొలుకులపల్లి భారతి



కొలుకపల్లి భారతి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 23: ఇబ్రహీంపట్నం మండల స్నేహ మహిళా సొసైటీ అధ్యక్షురాలిగా కొలుకులపల్లి భారతి ఏకగ్రీవంగా ఎన్నికైనారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శిగా అమృతను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికోసం కృషి చేస్తానన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.

తల్లడిల్లుతున్న తల్లులు, గర్భిణులు

- అంగన్‌వాడీ కేంద్రం కూల్చివేత
- పిల్లలకు, గర్భిణులకు అందని పౌష్టికాహారం



అంగన్‌వాడీ కేంద్రం వద్దకు పిల్లలతో వచ్చిన తల్లులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 23: మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న కమ్యూనిటీ హాల్ భవనం కూల్చివేయడటంతో పిల్లలు, గర్భిణులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పార్కు స్థలంలో కమ్యూనిటీ హాల్ భవనం నుంచి అంగన్‌వాడీ కేంద్రాన్ని తరలించాలన్న ఉద్దేశంతో చెప్పాపెట్టకుండా కాలనీ పెద్దలు భవనాన్ని కూల్చివేశారు. దీంతో పిల్లలు, గర్భిణు లకు పౌష్టికాహారం అందని పరిస్థితి నెలకొంది. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు ఉమానగర్‌లో పార్కు స్థలంలో కాలనీ వాసులు సొసైటీ కోసం ఒకవైపు కమ్యూనిటీ హాల్ మరోవైపు వినాయక మండపాన్ని నిర్మించారు. అయితే ప్రజావసరాల దృష్ట్యా ఐసీడీఎస్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు కాలనీవాసులతో మాట్లాడి 12 సంవత్సరాల కిందట కమ్యూనిటీ హాల్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రేకుల షెడ్డులో దీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈ అంగన్‌వాడీ కేంద్రాని కి పక్కా భవనం నిర్మించేందుకు ప్రభుత్వ హ యాంలో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనను కాలనీవాసులు ఇష్టపడటంలేదు. అయినా అంగన్‌వాడీ కేంద్రాన్ని తరలించడానికే కమ్యూనిటీ హాల్‌ను నేలమట్టం చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గర్భిణులు, పిల్లలు పడుతున్న ఇబ్బందులను గ్రహించిన స్థానిక కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి తన సొంత భవనంలోకి అంగన్ వాడీ కేంద్రం ఏర్పాటు చేసుకోవాలని ఐసీడీఎస్ అధికారులను కోరినప్పటికీ వారు ఒప్పుకోలేదని స్థానికులు తెలిపారు.



ఉమానగర్‌లో అంగన్‌వాడీ భవనం కూలగొట్టి చదును చేసిన పార్కుస్థలం

పార్కుస్థలం దక్కించుకునే ప్రయత్నాలు

ఉమానగర్‌కాలనీకి సంబంధించిన లేఅవుట్‌లో దాదాపు 250 చదరపు గజాల స్థలాన్ని పార్కు కోసం వదిలారు. కాగా పార్కుస్థలంలో కంచె ఏర్పాటు చేయకపోవటంతో పార్కుకు ఆనుకుని ఉన్న ప్లాట్ల యజమానులు పార్కుస్థలాన్ని కబ్జాచేసి ఇళ్లు నిర్మించుకున్నారు. పార్కుస్థలం కుదించుకపోయి 100 గజాలకు చేరింది. దీంతో పార్కుస్థలాన్ని కాపాడుకోవటానికి కాలనీవాసులు అక్కడ రేకులషెడ్‌తో కమ్యూనిటీ హాల్, దాని పక్కన వినాయక మండపాన్ని నిర్మించారు. అంగన్‌వాడీ కోసం పక్కాభవనం ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నందున పార్కుస్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించే ఇష్టంలేక కొందరు కాలనీవాసులు నేరుగా అంగన్‌వాడీ కేంద్రాన్నే తరలించేందుకు పావులు కదుపుతున్నట్లు స్థానిక మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో ఐసీడీఎల్ అధికారులు మౌనం పాటించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పిల్లలు ఇళ్లకే పరిమితమయ్యారు



పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లి పౌష్టికాహారం అందించే వీలు లేకుండా పోయింది. ఇతర వార్డుల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు చెప్తున్నారు. అయితే, ఇతర అంగన్‌వీడీ కేంద్రం అందుబాటులో లేక వెళ్లేందుకు వీలుపడక పిల్లలను ఇంటి వద్దే ఉంచాల్సివస్తోంది.
- జి.వనిత, స్థానికురాలు

పక్కా భవనం ఏర్పాటు చేయాలి



కాలనీ మహిళలకు అందుబాటులో పక్కా భవనం ఏర్పాటు చేసి అంగన్ వాడీ కేంద్రాన్ని ప్రారంభించాలి. పౌష్టికాహారం కోసం పిల్లలు, గర్భిణులు దూరపు ప్రాంతాల్లో ఉన్న అంగన్ వాడీ కేంద్రాలకు వెళ్లి తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పిల్లలను అం తదూరం తీసుకెళ్లలేకపోతున్నాం. అధికారులు స్పందించి వెంటనే అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించాలి.
- మమత, స్థానికురాలు

ఆ స్థలంలోనే పక్కాభవనం నిర్మించాలి



భవనం కూలగొట్టిన స్థలంలోనే తిరిగి పక్కా భవనం నిర్మించి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ప్రజలకు ఉపయోగపడే అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు పార్కుస్థలమే సరైనది. కట్టింది.. కూల్చింది కాలనీవాసులే కాబట్టి వారితో సంబంధం లేకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కొత్త భవన నిర్మాణాన్ని చేపట్టాలి.
- డి.రాజేశ్వరి, స్థానికురాలు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు



ఆమనగల్లులో విగ్రహప్రతిష్ట వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



మహాయజ్ఞంలో శ్రీ నారామణి పత్యంగీరా మహాదేవి , ఆచారి, భక్తులు

హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి

ఆమనగల్లు, ఆగస్టు23: ఆమనగల్లులోని కట్టమైసమ్మ దేవాలయంలో శుక్రవారం ఆలయ చైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మొక్తాల వెంకటయ్య ఆధ్వర్యంలోవిగ్రహప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి హాజరయ్యారు. శ్రీ సద్గురు శాంకరి అగోరి మాతా మహాగాయత్రి దేవి ఉపాసకురాలు నారాయణి పత్యంగీరా మాతాజీ పర్యవేక్షణలో అర్చకులు నాగభూషణం, శరత్‌చంద్ర, రామకృష్ణశర్మల ఆధ్వర్యంలో కట్టమైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీ నారాయణి పత్యంగీరా మహాయజ్ఞం చేపట్టారు. యజ్ఞంలో భక్తులు, మహిళలు వందలాదిగా పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీటీసీలు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కండె హరిప్రసాద్, మాజీ ఎంపీపీ తల్లోజు లలితవెంకటయ్య, పాపిశెట్టి రాము శ్వేత, సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్సై వెంకటేశ్ , కౌన్సిలర్లు తల్లోజు విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, లక్ష్మణ్, ఝాన్సీశేఖర్, దివ్య శ్రీకాంత్‌సింగ్, దుడ్డు కృష్ణ, శ్రీధర్, మండ్లీ రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జగన్, మానయ్య, గోరటి నర్సింహ్మా, మొక్తాల వెంకటయ్య, ఎర్రవోలు యాదయ్య, మొక్తాల చిన్న వెంకటయ్య, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి, ఆగస్టు 23: మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేద పండితులు యాదగిరి నర్సింహ్మాయ్య శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం, జలాదివాసం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అమ్మవారికి పూజలు నిర్వహించారు. దైవ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్ యాదవ్, నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, నరేందర్ గౌడ్, మస్కు వెంకటయ్య, శ్రీను, కృష్ణయ్య, తిరుపతయ్య, రామస్వామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక చొరవ



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఆగస్టు23: మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు పోచారం మున్సిపల్ సిబ్బంది బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో శుక్రవారం సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన వైద్యశిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ సిబ్బందికి క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహిస్తూ వారికి అవసరమైన చికిత్సలు అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విధులు నిర్వహించే సమయంలో అన్ని రకాల జాగ్రత్తలు పాటించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 170మంది సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కమిషనర్ వేమనరెడ్డి. కౌన్సిలర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు రూ.70.20లక్షలు మంజూరు

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రత్నప్రసాద్



మురుగు కాల్వలో ఉన్న తాగునీటి పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న మిషన్ భగీరథ డీఈ రత్నప్రసాద్

ధారూరు, ఆగస్టు 23: ధారూరు పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా కోసం ప్రభుత్వం రూ.70.20లక్షలు మంజూరు చేసిందని వికారాబాద్ డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రత్నప్రసాద్ తెలిపారు. ఆయన ధారూరులోని వివిధ కాలనీల్లో శుక్రవారం పర్యటించి తాగునీటి సరఫరా పైప్‌లైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీటి వసతి, ఇబ్బందులపై స్థానికులతో మాట్లాడారు. ధారూరు గ్రామంలో కొన్ని కాలనీల్లో మిషన్ భగీరథ పైపులైన్ వేయలేదని, కొన్ని కాలనీల్లో ఇళ్లకు తాగునీరు రావడం లేదని, మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడంలేదని కాంగ్రెస్ నాయకులు, ప్రజలు డీఈ దృష్టికి తెచ్చారు. ప్రత్యామ్నాయ సౌకర్యం లేక తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అనంతరం డీఈ రత్నప్రసాద్ మాట్లాడుతూ.. నీతి అయోగ్ ద్వారా తెలంగాణకు 1200 కోట్లు మంజూరుకాగా, ధారూరుకు రూ.57లక్షలు కేటాయించారని ఆయన చెప్పారు. ఈ నిధులతో ధారూరులో పాత తాగునీటి ట్యాంకును తొలగించి కొత్తగా 60కేవీ వాటర్ ట్యాంకును నిర్మించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు 190నల్లా కనెక్షన్లు, 2కిలోమీటర్ల పైపులైన్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. ఎస్‌డీఎఫ్ ద్వారా 13.25 లక్షలు మంజూరు అయ్యాయని, ఈ నిధుల నుంచి రూ.5లక్షలతో 400 మీటర్ల తాగునీటి పైపులైన్ నిర్మాణం, రూ.5లక్షలతో రెండు బోర్‌వెల్స్, పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మరో రూ.3.20లక్షలతో ఎనిమిది బోర్ల ఫ్లషింగ్, డీపింగ్ పనులు చేయిస్తామని వివరించారు. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేసి తాగునీటి సమస్య తీరుస్తామని తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత నీతిఅయోగ్ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. డీఈ వెంట పంచాయతీ కార్యదర్శి అంజా నాయక్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీడీవో రామేశ్వరి దేవి

కడ్తాల్, ఆగస్టు 23: చెంచుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు సకాలంలో వారికి చేరేలా, సక్రమంగా అమలయ్యేలా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రామేశ్వరి దేవి కోరారు. కడ్తాల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో సుజాత అధ్యక్షతన చెంచుల పథకాల అమలుపై చెంచు ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్, ఓటరు, ఈజీఎస్ జాబ్‌కార్డు, కిసాన్ క్రెడిట్, రేషన్‌కార్డు, కులధ్రువీకరణపత్రాలు ఇప్పటి వరకు పొందని వారు ఉంటే చెంచు ఆవాస ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు చెంచులంతా సద్వినియోగం చేసుకునేలా చూడాలని డీటీడీవో అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కడ్తాల మండల పరిధిలోని న్యామతాపూర్,అన్మాస్‌పల్లి, జమ్ములబావి తండా, మాదవపూర్, వాసుదేవ్‌పూర్, ముద్విన్, కర్కల్‌పహాడ్ చెంచు కాలనీలకు సంబందించిన చెంచుల కోసం శుక్రవారం నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు ఆయా పంచాయతీ కార్యాలయాలలో ప్రత్యేక శిబిరాల ద్వారా ధరకాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, ఏఈలు నరేందర్, పరమేశ్, శ్రావ్య, ఐకేపీ ఏపీఎం రాజేశ్వరి, మెడికల్ ఆఫీసర్ స్రవంతి, ఏపీవో లలిత, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం



నూతన బస్సును ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్‌లు కొండారెడ్డి,గణేష్ ముదిరాజ్

కందుకూరు, ఆగష్టు 23: గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన రవాణ సౌకర్యం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలని లేమూరు మాజీ సర్పంచ్ గూడూరు కొండారెడ్డి, డిల్లీ గణేష్‌ముదిరాజ్‌లు కోరారు. శుక్రవారం నగరంలోని ఉమెన్స్‌కాలేజీ నుంచి లేమూరు గ్రామం వరకు మిధానిడిపోకు చెందిన బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉమెన్స్ కాలేజీ నుంచి బస్సు సౌకర్యం లే క గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించి ప్రభుత్వం నూతనంగా బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.జైపాల్, జి.యాదయ్య, రాజు, గణేస్, మల్లేష్, క్రిష్ణ, కె.పొన్నమ్మ, కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు, ఆగస్టు, 23: మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. మండల కేంద్రంలో నిర్మాణం చేయనున్న ఇంటిగ్రెటెడ్ స్కూల్, స్టేడియం ఏర్పాటుకు శుక్రవారం ఎమ్మెల్యే స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా స్టేడియం ఏర్పాటుకు మండల కేంద్రంలోని తూర్పు పట్టి సర్వేనెంబర్ 19లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని, ఇంటిగ్రెటెడ్ స్కూల్ ఏర్పాటు కోసం పడమరపట్టిలో 109 సర్వేనెంబర్‌లో 16 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్ నుంచి పరిగి వరకు నాలుగులైన్ల రోడ్డు త్వరలో మంజూరు కానుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు కె రామయ్య గౌడ్, కె యాదయ్య, బి పెంటయ్య బి నరేందర్, సి కృష్ణయ్య, ఆర్ రామస్వామి, బి రవి, తహశీల్దార్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 23: మేడ్చల్ పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. పట్టణంలోని ఎయిర్‌ఫోర్స్ కాలనీ, సాయిబాబానగర్ కాలనీ, వీకర్‌సెక్షన్ కాలనీ, ఏకలవ్యనగర్, టీచర్స్, సత్యనారాయణ కాలనీలతో పాటు కటిక బస్తీకి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మా తండాను పంచాయతీ చేయాలి



ధారూరు, ఆగస్టు 23: స్టేషన్ ధారూరు పంచాయతీలో అనుబంధ గ్రామంగా కొనసాగుతున్న డీకే తండాను పంచాయతీగా ఏర్పాటు చేయాలని తండా వాసులు అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్‌ను కోరారు. వికారాబాద్‌లో స్పీకర్‌ను శుక్రవారం కలిసి వారు వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం స్టేషన్ ధారూరు గ్రామపంచాయతీలో ఉన్న తమ తండా అభివృద్ధికి దూరంగా ఉందని వారు వివరించారు. గత ప్రభుత్వంలో తండాను పంచాయతీగా చేయాలని ప్రతిపాదించామని వారు గుర్తుచేశారు.

ధర్నాలు చేస్తున్నది రాజకీయ నిరుద్యోగులే


తాండూరు: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు, ఆగస్టు 23: రుణమాఫీ జరుగలేదంటూ రైతుల ముసుగులో రోడ్లపైకి వచ్చి రాజకీయ నిరుద్యోగులే ధర్నా చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, మాజీ ఎంపీపీ కరుణం పురుషోత్తం రావు, జిల్లా నాయకులు ఉత్తమ్‌చందు, మార్కెట్ కమిటీ చైర్మన్లు అంజయ్య, మాధవరెడ్డిలు ఆరోపించారు. తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మూడు విడతల్లో కలిపి జిల్లా వ్యాప్తంగా 89435 మంది లబ్ధిదారులకు రూ.744కోట్లు, అందులో తాండూరులో 14139 మంది లబ్ధిదారులకు సుమారు రూ.103 కోట్ల వరకు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. తాండూరు బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి లేకుండా ధర్నా నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులెవరూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉచ్చులో పడొద్దని సూచించారు. సాంకేతిక లోపంతో రుణమాఫీ కానివారికి ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. క్లస్టర్ల వారీగా నోడల్ అధికారులు నియమించి దరఖాస్తుల స్వీకరించి అర్హులైన వారందరికీ మాఫీ చేయనున్నట్లు తెలిపారు. రైతులతో రాజకీయం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. హరీశ్‌రావు రాజీనామా డిమాండ్‌ను పక్కదారి పట్టించేందుకు బావ బామ్మర్దులు నాటకాలు ఆడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నాయకత్వంలో ఎనిమిది నెలల్లో ఎంతో అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు. మున్సిపల్ పరిధిలో కేవలం ఒక ఆగస్టు నెలలోనే రూ.8కోట్లతో అభివృద్ధి పనుల ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ సింగిల్ విండో వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్‌లాల, కౌన్సిలర్ నిరజబాల్‌రెడ్డి, నాయకులు రాములు, లంక నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై అసత్య ఆరోపణలు తగదు

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం తగదని డీసీసీ ప్రధానకార్యదర్శి ఎస్.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఏకకాలంలో రూ.2లక్షల పంట రుణాల మాఫీ చేయడం చరిత్రాత్మకమని అన్నారు. దేశచరిత్రలో ఒకేసారి రూ.31వేల కోట్ల రుణమాఫీ చేసిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తుంటే బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. రుణమాఫీ కాని రైతుల ఇంటింటికి అధికారులే వెళ్లి దరఖాస్తు తీసుకుని రుణమాఫీ చేస్తారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. త్వరలోనే రైతుభరోసా ఇవ్వనున్నట్లు తతెలిపారు. రైతులు బీఆర్ఎస్ నాయకులను నమ్మకూడదని సూచించారు.

రైతులు ఆందోళన చెందొద్దు

నవాబుపేట: రైతు రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దని నవాబుపేట మండల వ్యవసాయ శాఖ అధికారిణి ప్రసన్నలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందని తెలిపారు. రుణమాఫీ పట్ల ఏవైనా సందేహాలుంటూ వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

దోమ: బీఆర్ఎస్ పార్టీ ధర్నా కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డిపై బొంపల్లి మాజీ ఎంపీటీసీ రాములు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బొంపల్లి గ్రామంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎంపీటీసీ రాములు సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాదని గుర్తుంచుకోవాలన్నారు. రాములును నమ్మి దళిత సోదరులు మోసపోయారని ఆరోపించారు. రైతులెవరూ అధైర్యపడొద్దని ప్రతీ ఒక్కరికి రుణమాఫీ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేశ్, నాయకులు రమేశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


దోమ: బొంపల్లిలో మాట్లాడుతున్న నాయకులు

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మెరుగైన వైద్యం


చెక్కులు అందజేస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 23: సీఎం సహాయనిధితో పేదకు మెరుగైన వైద్యం అందుతోందని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో అవసరమున్న ప్రతీఒక్కరికి సీఎం సహాయనిధి అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అవసరమున్న వారందరు సీఎంఆర్ఎఫ్ కింద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, బేరి బాల్‌రాజ్, కమిషనర్ అజ్మీరా స్వామినాయక్, మాజీ ఉపసర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, కె.ప్రతాప్‌రెడ్డి, శంకర్, జీత్‌రెడ్డి పాల్గొన్నారు.

సుద్ద కంపెనీ కాలుష్యంపై చర్యలు చేపట్టాలి


వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు


ధారూరు, ఆగస్టు 23: మండలంలోని నాగసమందర్ గ్రామ శివారులోని సుద్ద కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు శుక్రవారం తహసీల్దార్ సాజిదా బేగంకు ఫిర్యాదు చేశారు. ఈ కంపెనీ నుంచి వస్తున్న పొగ, దుమ్ముతో, రసాయన వాయువులతో పక్క పొలాల్లోని పంటలు పాడై రైతులు నష్టపోతున్నారని, గ్రామంలోకి పొగవచ్చి ప్రజలకు అనారోగ్యం బారిన పడుతున్నారని కంపెనీ కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఎం.రమేశ్, మణికంఠరెడ్డి, బాలు, కృష్ణ, రాజు కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


బద్లాపూర్‌లో డ్రైనేజీలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

బషీరాబాద్, ఆగస్టు 23: ఇంటి పరిసరాలను ప్రతీఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని బషీరాబాద్ ఎంపీడీవో గాలి యాదయ్య అన్నారు. మండలంలోని బద్లాపూర్ గ్రామాన్ని శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీవో బాలగంగాధర్‌చారితో కలిసి ఎంపీడీవో సందర్శించారు. గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటించారు. సీసీ రోడ్లపై పశువులను కట్టేయడంతో యజమానులను పిలిచి పారిశుధ్యం లోపిస్తే జరిగే అనార్థలను వివరించారు. క్యాటిల్ షెడ్లు నిర్మించుకోవాలని సూచించారు. మురుగుకాల్వలను పరిశీలించి ఎప్పటికప్పుడూ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించి కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఈజీఎస్ ఈసీ నర్సింహారెడ్డి, టీఏ శ్యామప్ప పాల్గొన్నారు.

కీసరను ప్రత్యేక మున్సిపాలిటీ చేయాలి


అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

కీసర, ఆగస్టు 23: కీసరను ప్రత్యేక మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని కీసర గ్రామస్థులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఔటర్ చుట్టూ ఉన్న గ్రామాలను నగరంలో వీలినం చేసేందుకు శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామసభలు ఏర్పాటు చేశారు. అభిప్రాయ సేకరణలో భాగంగా మండల కేంద్రం కీసరను ఎట్టి పరిస్థితిలో గ్రేటర్‌లో వీలినం చేయొద్దని కోరారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నగరంలో వీలినం చేయవద్దని ధర్నా చేశారు. కీసరను ప్రత్యేక మున్సిపల్ చేస్తే భోగారం, అంకిరెడ్డిపల్లి గ్రామాలను కీసరలో కలపాలని, గోధుమకుంట ప్రత్యేక మున్సిపల్, లేదా నాగారం మున్సిపల్‌లో వీలినం చేయాలని గ్రామస్థులు తీర్మానం చేశారు. నర్సంపల్లి, కరీంగూడ, తిమ్మాయిపల్లి, రాంపల్లి దాయర గ్రామస్థులు మున్సిపాలిటీ ఏర్పాటుకు మొగ్గుచూపారు. కీసరగుట్ట చరిత్రను దృష్టిలో పెట్టుకొని కీసరను ప్రత్యేక మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలన్నారు. లేదంటే గ్రామపంచాయతీగానే కొనసాగించాలన్నారు.

కాటమయ్య రక్షణ కిట్‌లపై అవగాహన

కులకచర్ల, ఆగస్టు 23: మండలంలోని కులకచర్ల, అంతారం, ఇప్పాయిపల్లి, తిర్మలాపూర్ గ్రామాల గీతా కార్మికులకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కిట్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన కిట్‌లతో తాటి, ఈత చెట్లు ఎలా ఎక్కాలో వివరించారు. ప్రమాదాల నివారణకు ఈ కిట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, ఆంజనేయులుగౌడ్, రాంచంద్రయ్యగౌడ్ పాల్గొన్నారు.

గ్రామాలను ఇతర జిల్లాలో కలపొద్దు


ఘట్‌కేసర్ రూరల్: గ్రామసభలో పాల్గొన్న గ్రామస్థులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 23: తమ గ్రామాలను ఇతర జిల్లాల్లో కలపొద్దని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ముఖ్యంగా అవుషాపూర్, అంకుశాపూర్, మాధారం గ్రామాల్లో జరిగిన గ్రామసభలో గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మూడుగ్రామాల ప్రజలు తమను వేరేజిల్లాలో కలుపొద్దని ముక్తకంఠంతో ఏకవాఖ్య తీర్మానం ప్రవేశపెట్టారు. ఎదులాబాద్‌లో ఇంకా పదేళ్లపాటు తమ గ్రామాన్ని పంచాయతీగానే కొనసాగించాలని గ్రామసభలో తీర్మానించారు. ఈ కార్యక్రమాల్లో ప్రత్యేక అధికారులు ఏవీకే మోహన్‌రావు, గీతారెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచులు ఏనుగు కావేరిమశ్చేందర్‌రెడ్డి, యాదగిరి, ఓరుగంటి వెంకటేష్‌గౌడ్, కొంతం వెంకట్‌రెడ్డి, మంగమ్మ, నాయకులు పన్నాల కొండల్‌రెడ్డి, కవాడి వామన్‌రెడ్డి, అయిలయ్య, మశ్చేందర్‌రెడ్డి, సందీప్ రెడ్డి, మాదవరెడ్డి, జంగయ్య, బిక్షపతిగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

మా గ్రామాన్ని మేడ్చల్ మున్సిపల్‌లో కలపొద్దు

మేడ్చల్ టౌన్: తమ గ్రామాన్ని మేడ్చల్ మునిసిపాలిటీలో విలీనం చేయరాదంటూ కోరుతూ మండలంలోని పూడూరు గ్రామ ప్రజలు అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. శుక్రవారం ఎంపీవో సునీత, కార్యదర్శి మధు ఆధ్వర్యంలో పూడూరు గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బాబు యాదవ్ ఆధ్వర్యంలో స్థానికులు తమ గ్రామాన్ని మేడ్చల్ మున్సిపల్‌లో విలీనం చేయరాదంటూ తీర్మానించారు. మండలంలో మేజర్ పంచాయతీగా ఉన్న తమ గ్రామంలో చుట్టు ప్రక్కల గ్రామాలు కలుపుతూ ప్రత్యేకంగా మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని కోరారు. మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనం చేస్తే తమ గ్రామ అభివృద్ధి కుంటు పడుతుందని గ్రామస్తులు అధికారులకు తెలిపారు. కాగా గ్రామస్తుల ప్రతిపాదనను ఉన్నతాధికారులకు పంపుతామని అధికారులు తెలిపారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్న పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకదృష్టి సారించామని అధికారులు తెలిపారు. తిరిగి పంచాయతీల ఎన్నికలు నిర్వహించి ప్రజాప్రతినిధుల పాలన వచ్చేంత వరకు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందింస్తామని తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


అన్నదానం చేస్తున్న డాక్టర్ సవిత

వికారాబాద్, ఆగస్టు 23: పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో శ్రావణ మాసం శుక్రవారం పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సతీమణి సబితా, కౌన్సిలర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో వీరశైవ సమాజం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పావని చంద్రశేఖర్, సంతోష, నర్సింహులు, రాజ్యలక్ష్మి, రాజ్యలక్ష్మీ రమణ, దమయంతి వెంకటేశం, అనిత అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

తాండూరు రూరల్: అంతారంలో శివాలయం నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణంతోపాటు శివాలయాన్ని నిర్మించేందుకు భక్తులు ముందుకువచ్చారు. ఇందులో భాగంగా అర్చకుడు వెంకటాచర్ శుక్రవార్ ఆధ్వర్యంలో బి.అజయ్ దంపతులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శాంతు, మాజీ వార్డు సభ్యులు ఎల్.రాజేందర్‌రెడ్డి, ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు వుల్ల ప్రభాకర్‌రెడ్డి, సల్ల సంపత్‌కుమార్, కురవ శ్రీనివాస్, కేసీ కోటప్ప, బీరప్ప, లక్ష్మణ్, ప్యాట బాలప్ప పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మున్సిపల్ చైర్మన్

కొడంగల్: కొడంగల్ మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి శ్రీవేంకటేశ్వ రస్వామిని దర్శించుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆయన శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శేఖర్, విజయ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నవాబుపేట, ఆగస్టు 23: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నవాబుపేట ఎస్ఐ అరుణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్, సీటు బెల్టుతో పాటు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై మురళీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కళాజాత బృందం ఆధ్వర్యంలో..


రేగడిమామిడిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మధుసూదనరెడ్డి

పూడూరు: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పూడూరు మండలంలోని రేగడిమామిడిపల్లిలో శుక్రవారం కళాజాత బృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి సైబర్ క్రైం, డయల్ 100, ట్రాఫిక్ నియమాలు, బాల్య వివాహాల నిర్మూలన, ట్రాఫిక్ తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ నిరంజన్, అంజి, కళాజాత బృందం సభ్యులు అశోక్ పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు సన్మానం


యూనియన్ బ్యాంకు మేనేజర్‌ను సన్మానిస్తున్న రైతులు

మర్పల్లి, ఆగస్టు 23: రుణమాఫీ జరిగిన రైతులకు వారం రోజుల్లో తిరిగి కొత్త రుణాలు అందిస్తామని మర్పల్లి యూనియన్ బ్యాంకు మేనేజర్ రమేశ్ తెలిపారు. మర్పల్లి యూనియన్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న రమేశ్ అదే బ్యాంకులో మేనేజర్‌గా పదోన్నతి పొందడంతో పలు గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం ఆయనను శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంకు పరిధిలోని రైతులు రుణమాఫీ అయిందంటే రైతులు భూమికి సంబంధించిన వన్‌బీ పహాణీ జిరాక్స్‌తో పాటు ఏ పంటలు సాగు చేశారో అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకొస్తే తిరిగి రుణం అందిస్తామని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా పంట రుణాల కోసం రైతులు నేరుగా బ్యాంకు అధికారులను ఆశ్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రామేశ్వర్, పాండురంగం, అబ్రహం, నర్సింహులు యాదవ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త


చిట్యాల ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్

పరిగి, ఆగస్టు 23: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చిట్యాల్ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిర్లక్ష్యం చేస్తే వ్యాధులు పెరిగే అవకాశం ఉందన్నారు. జ్వరాల బాధితుల సంఖ్య పెరుగుతోందన్నారు. మాములు జ్వరమే కదా అని నిర్లక్ష్యం చేయొద్దని, టైఫాయిడ్, మలేరియా రోగుల సంఖ్య పెరిగిందని తెలిపారు. డెంగీ కేసులు కూడా నమోదు అవుతున్నాయని తెలిపారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వేడివేడి పదార్థాలనే తినాలని, కాలిచల్లార్చిన నీటిని తీసుకుంటే మంచిదని తెలిపారు. వైరల్ జ్వరాలకు ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ ఉండదని, లక్షణాలను బట్టి చికిత్సలు చేయించుకోవాలని సూచించారు.

సంక్షిప్తంగా..

- **తాండూరు రూరల్:** మండల పరిధిలోని వివిధ పాఠశాలలను ఎంఈవో వెంకటయ్య శుక్రవారం సందర్శించారు. మండల పరిధిలోని సంగెంకలాన్ యూపీఎస్, మల్కాపూర్ ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్, కొత్లాపూర్ పీఎస్, కోటబాస్పల్లి యూపీఎస్, గౌతాపూర్ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్, బేస్‌లైన్ టెస్ట్ నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల హాజరుశాతం, అమ్మ ఆదర్శ పాఠశాల, పనుల పురోగతి పరిశీలించారు.
- **పరిగి:** అర్హత ఉండి గృహజ్యోతి వర్తించని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా గతంలో దరఖాస్తులు చేసుకోని వారు కూడా ప్రస్తుతం దరఖాస్తులకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని తెలిపారు. ఇలాంటి లబ్ధిదారులు ఎవరైనా ఉంటే మునిసిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు.
- **దోమ:** తిమ్మాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు రాగిజావ తాగేందుకు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ రేఖ, వీఏఎస్‌ ఆంజనేయులు శుక్రవారం గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ఎలాంటి సమస్య వచ్చినా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 23: యాక్టీవాను వెనుక నుంచి పాలవ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎదులాబాద్‌కు చెందిన కొమ్ము లక్ష్మయ్య(65) ఈనెల 17వ తేదీన తన భార్య యాదమ్మతో కలిసి ఘట్‌కేసర్ నుంచి ఇంటికి వెళ్తుండగా ఎన్ఎఫ్‌సీనగర్‌లోని మదర్‌థెరిస్సా కళాశాల సమీపంలో పాలవ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన లక్ష్మయ్యను చికిత్సనిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. లక్ష్మయ్య చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. యాదాద్రి-భువనగిరి జిల్లా, భూధాన్ పోచంపల్లి మండలం కప్రాయిపల్లికి చెందిన డ్రైవర్ సుదర్శన్ పాలవ్యాన్‌ను నిర్లక్ష్యంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని లక్ష్మయ్య కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వంట గ్యాస్ లీకేజీతో మంటలు.. ఇద్దరికి తీవ్ర గాయాలు

బషీరాబాద్, ఆగస్టు 23: ఇంట్లో వంట గ్యాస్ లీకేజీతో మంటల చెలరేగి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బషీరాబాద్ మండలం రెడ్డిఘణపూర్ గ్రామంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూర్వ దేవప్ప ఇంట్లో గ్యాస్‌స్టవ్ వెలగడంలేదని భార్య చెప్పడంతో అక్కడే ఉన్న భర్త సమీపంలోని మగ్దూం అనే వ్యక్తిని చూడమని పిలిచాడు. ఈక్రమంలో ఇంట్లోకి వచ్చిన మగ్దూం అగ్గిపుల్లతో గ్యాస్ వెలిగించగా, అప్పటికే గదిలో వ్యాపించిన గ్యాస్‌తో మంటలు చెలరేగాయి. దీంతో మగ్దూం, అక్కడే ఉన్న దేవప్పకు ఉవ్వెత్తున గ్యాస్‌మంట సెగ ఒక్కసారిగా తగలడంతో ముఖం, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితులను కుటుంబసభ్యులు తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

జీవితంపై విరక్తిచెంది వ్యక్తి ఆత్మహత్య

తాండూరు రూరల్, ఆగస్టు 23: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన తాండూరు మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇనుగుర్తి గ్రామానికి చెందిన ఒలిగిరి కృష్ణకుమార్(30) డ్రైవింగ్ పని చేసేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై పనిచేయడం మానేశాడు. ఇటీవల రాఖీ పండుగ కావడంతో భార్య సావిత్రి పుట్టింటికి వెళ్లింది. అయితే కృష్ణకుమార్ తనకు పిల్లలు కావడం లేదని జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడు. అనంతరం అదే గ్రామానికి చెందిన నారాయణ అనే వ్యక్తికి ఫోన్‌చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. వెంటనే ఇంటికి వచ్చిన నారాయణ అపస్మారక స్థితిలో ఉన్న కృష్ణకుమార్‌ను చికిత్స నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వరకట్న వేధింపుల కేసులో వ్యక్తికి జైలుశిక్ష

కొడంగల్, ఆగస్టు 23: నియోజకవర్గ పరిధిలోని దౌల్తాబాద్ మండలం మాటూర్ గ్రామానికి చెందిన కె.భగవంత్‌రెడ్డి వరకట్నం తీసుకురావాలని తన భార్యను వేధిస్తున్నాడని 2014, జూన్ 22న కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. పోలీసుల దర్యాప్తు అనంతరం నిందితుడు కె.భగవంత్‌రెడ్డిని రిమాండ్‌కు పంపించారు. ఈ ఘటనలో వాదోపవాదాలు విన్న కొడంగల్ మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తున్నట్లు తీర్పునిచ్చినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ఆలయంలో చోరీ

బొంరాస్‌పేట్, ఆగస్టు 23: మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులో గల శ్రీ పార్వతీ పరమేశ్వర ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలయ కమిటీ సభ్యులు అంజిలయ్య, రాములు, కేశవులు, శ్రీనివాస్, నర్సింహులు తెలిపారు. ఆలయంలోని హుండీని పగలగొట్టి దుండగులు చోరీకి పాల్పడటంతో శుక్రవారం గ్రామస్థులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 23: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ అర్చన తెలిపారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం ఆర్టిఫియల్ ఇంటలిజెన్స్ ఆధ్వర్యంలో 'ది నెక్స్ బింగ్ థింగ్ ఇన్ ఎఐ' అవగాహన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్ విభాగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రాబోవు కాలంలో ఏఐ ముఖ్యభూమిక పోషిస్తుందని గుర్తుచేశారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిపీషయల్ ఇంటలిజెన్స్ డీన్ విజయ్‌కుమార్, అధ్యాపకులు మల్లికార్జున్‌రెడ్డి, మనోరంజన్‌దాస్, అర్చన, అర్జున్ పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

తాండూరు, ఆగస్టు 23: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని తాండూరు మున్సిపల్ సీపీఎస్ ఉద్యోగులు నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. సీపీఎస్ విధానంతో పదవీ విరమణ తర్వాత తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, సీపీఎస్ ఉద్యోగులు రాములు, నర్మద, యాదగిరి, నాగేందర్, కపిల్ కుమార్, సతీష్, అనిల్ కుమార్, నాగరాజు, గోపాల్ ఉన్నారు. రెగ్యులర్ ఉద్యోగి విఠల్, కాంట్రాక్ట్ ఉద్యోగి వేణుగోపాల్, ఐకేపీ కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్‌లు సీపీఎస్ ఉద్యోగులకు మద్దతునిచ్చారు.

బీసీ గురుకుల కళాశాలను తరలించొద్దు


కడా ప్రత్యేకాధికారికి వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

దౌల్తాబాద్, ఆగస్టు 23: మండలంలోని నీటూర్ గ్రామానికి మంజూరైన బీసీ గురుకుల కళాశాలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని విద్యార్థి సంఘం నాయకులు పులిందర్‌గౌడ్ కోరారు. కొడంగల్‌లో శుక్రవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డికి వారు వినతి పత్రం అందజేశారు. నీటూర్ పరిసర గ్రామాలు కొడీడ్, నర్సాపూర్, నందిగామ గ్రామాలకు చెందిన విద్యార్థులు విద్యాభ్యాసానికి ఎన్నో వ్యయప్రయాసలు పడాల్సివస్తోందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో మంజూరైన కళాశాలను కొంత మంది ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఫయాజ్, రాజు, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే ఆరోపణలు


మాట్లాడుతున్న మాజీ ఎంపీటీసీ రాములు

దోమ, ఆగస్టు 23: రాజకీయంగా తనను ఎదుర్కోలేకే కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని బొంపల్లి మాజీ ఎంపీటీసీ రాములు అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. రుణమాఫీ అయిందని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు ఎంత మంది రైతులకు అయిందో చూపెట్టాలన్నారు. మాజీ సర్పంచ్ సురేశ్ ఐదేళ్లు గ్రామాన్ని చీడ పురుగుల పట్టి పీడించాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుడు రామన్న మాదిగ, బీఆర్ఎస్ నాయకులు మొయిన్‌పాష, వెంకటయ్య, గౌసొద్దీన్, ముద్దం ప్రవీణ్‌యాదవ్, మోసిన్ పాష, శ్రీనివాస్, శ్రీనివాస్, నర్సింహులు పాల్గొన్నారు.